క్లుప్తంగా

సంక్రాంతి ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలలో మహిళలు

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లె గ్రామంలో రెండు రోజులుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ వరలక్ష్మి మాట్లాడుతూ ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు సంక్రాంతి పండుగ రోజున బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకుల అందజేత


క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులను పంపిణీ చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని టీబీ నివారణా కేంద్రంలో మంగళవారం మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దేవిరెడ్డి వెంకటకొండారెడ్డి ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు రాగి పిండి, గోధుమ పిండి, వేరుశనగ పప్పు, పెసలు, గోధుమ రవ్వ, బెల్లం తదితర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ నివారణా కేంద్ర అర్బన్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ నాగేంద్ర ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది నాగ్లా నాయక్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సబిత

పెద్దముడియం : నెమళ్లదిన్నె గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లలోని విద్యార్థులకు డాక్టర్ సబితా ఆధ్వర్యంలో మంగళవారం దంత పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం మేడిదిన్నె పీహెచ్‌సీ వైద్యుడు హుస్సేన్ అవసరమైన వారికి చికిత్సలు అందిస్తామని తెలిపారు.

ఎద్దులయేనేలో పరిసరాల పరిశుభ్రత


చెత్త కుండీలను ఏర్పాటు చేస్తున్న విద్యార్థులు

వేముల : మండల పరిధిలోని ఎద్దులయేనే గ్రామంలో మంగళవారం పులివెందుల ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో ఉన్న చెత్తను వేరుచేసి పరిసరాలను శుభ్రపరిచి చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఏడు కొండలు, జయమ్మ, కళాశాల వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురిజాలలో భాగవత పారాయణం


భాగవత పారాయణం నిర్వహిస్తున్న భాగవత సమాజ సభ్యులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల కొల్హాపూర్ మహాలక్ష్మిదేవి ఆలయంలో మంగళవారం పల్లెపల్లెకు భగవద్గీత కార్యక్రమంలో మొదటి రోజు భగవద్గీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత ఉపన్యాసకులు భగవద్గీత పారాయణం నిర్వహించి మాట్లాడుతూ భగవద్గీత మన జీవితాన్ని తెలియజెప్పే నిత్య జీవన గ్రంథమని.. కొద్ది గంటల సమయంలోనే సనాతన ధర్మాన్ని తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో భాగవత సమాజ సంస్థ ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీను, నారాయణరెడ్డి, సంజీవరెడ్డి, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : పట్టణంలోని మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయంలో బుధవారం జరిగే సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మార్కెట్ యార్డు కమిటీతో సమావేశం నిర్వహించి మధ్యాహ్నం నుంచి పట్టణంలోని 3, 12, 13, 14, 17వ వార్డుల్లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన అందులో పేర్కొన్నారు.

'గడప గడప'కు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


సి.కొత్తపల్లెలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వల్లూరు సచివాలయ పరిధిలోని సి.కొత్తపల్లె, లింగాయపల్లె, ఇసుకపల్లె గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రజలు చెబుతున్న సమస్యలను వింటూ, అక్కడి కక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ప్రజల నుంచి కృతజ్ఞతలు అందుకుంటూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని సీఎం పదే పదే చెబుతున్నారన్నారు. మూడున్నరేళ్లుగా జగనన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. 2014లో వేల హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివన్నారు. వారికి డిపాజిట్ కూడా దక్కదని, ఇక వారు ఇంటికే పరిమితం అవుతారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆదరాభిమానాలు కావాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, గంగయ్య, వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, శ్రీను, చెన్నారెడ్డి, లక్షారెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

మండల సమావేశంలో ఎంపీపీ ఎం.వరలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

పెండ్లిమర్రి : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైన మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణం స్పందించాలన్నారు. అలాగే జెడ్పీ వైస్ చైర్మన్ పి.బాలయ్య మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని సర్పంచ్‌లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెండ్లిమర్రి హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులతో నీళ్లు మోపించడం, క్లాస్ రూమ్‌లల్లో కసువు ఊడ్పించడం వంటి పనులు చేయిస్తున్నారని సర్పంచ్ నాగమల్లారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఎంఈఓ సుజాత ఇక నుంచి అలాంటి పనులు జరగకుండా చూసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కొండూరు ఎంపీటీసీ వెంకటశివారెడ్డి మిని గోకులాల బిల్లులు రాలేదని త్వరగా వచ్చేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజు, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని 15 సచివాలయాల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కన్వీనర్ల అధ్యక్షుడిగా బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వీరప్రతాప్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం వీరప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా దానిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మండలంలోని ఎస్.పాలగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు చాపాటి రమణారెడ్డి, గజ్జల రాజా రమేష్‌రెడ్డి తమ అనుచరులతో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు క్రీడాకారులు

వేంపల్లె : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వేంపల్లె ఆర్‌పీఎస్‌ఆర్ క్రికెట్ అకాడమి క్రీడాకారులు ఎంపికైనట్లు ఆ అకాడమి చైర్మన్ రామిరెడ్డి తెలిపారు. మంగళవారం పుల్లంపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 క్రికెట్ పోటీలలో కాత్యాయని, బాలాజి, కృష్ణ, అహ్మద్ ఖిజార్, మన్సూరీ, అండర్–14 విభాగంలో ఎం.అక్షిత్‌రెడ్డిలు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని.. ఈనెల 11వ తేదీనుంచి 13వ తేదీ వరకు మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–19 క్రికెట్ పోటీలలో పాల్గొంటారన్నారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్ పీఈటీలకు న్యాయం చేయాలి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ న్యాయం చేస్తున్నట్లే 98 డీఎస్సీ క్వాలిఫైడ్ పీఈటీలకు న్యాయం చేయాలని 98 డీఎస్సీ క్వాలిఫైడ్ పీఈటీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాయప్ప, రాజా కోరారు. మంగళవారం వారు కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులకు న్యాయం చేస్తున్న సీఎం తమ వైపు కూడా చూసి న్యాయం చేయాలన్నారు. తాము 98 డీఎస్సీలోనే క్వాలిఫై అయ్యామని, తమకు పోస్టింగులు ఇచ్చి న్యాయం చేయాలని వారు కోరారు.

స్వార్థం కోసమే టీడీపీ నాయకుల నిరసనలు

కమలాపురం : టీడీపీ నాయకులు తమ స్వార్థం కోసమే నిరసనలు చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మస్తానయ్య ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీఓ కార్యాలయం వద్దకు మార్చుతున్నారని టీడీపీ నాయకులు చేస్తున్న నిరసనలు కేవలం వారి స్వార్థం కోసమేనన్నారు. డంపింగ్ యార్డు వద్ద మున్సిపల్ కార్యాలయం నిర్మిస్తే విమర్శించని టీడీపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు మార్చుతామంటే ఎందుకు నిరసన చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. డంపింగ్ యార్డు వద్దకు తరలిస్తే అప్పాయపల్లె, అక్కా నగర్, మారుతినగర్, బీడీ కాలనీ, కొత్తపల్లె తదితర కాలనీల ప్రజలకు దూరం కాదా అని ఆయన అన్నారు. కేవలం డంపింగ్ వార్డు వద్ద టీడీపీ నాయకుల భూములు ఉండటంతోనే అక్కడ మున్సిపల్ కార్యాలయం నిర్మిస్తే నిరసనలు చేపట్టలేదన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలకు అనువుగా ఉంటుందనే నగర పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆయన వివరించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి

వేంపల్లె : మండల వ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీపీ లక్ష్మీగాయత్రి మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సచివాలయాల వారీగా సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పునాదులు పూర్తి చేసిన వారికి మిగిలిన గోడలు, శ్లాబ్ వేయించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జగనన్న కాలనీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని మౌలిక వసతులతోపాటు ఇసుక, సిమెంటు లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత వెలిదండ్ల జట్టు


వెలిదండ్ల జట్టుకు మెమెంటోను అందిస్తున్న నిర్వాహకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని సీఎస్ఐ చర్చి క్రీడా మైదానంలో మంగళవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతగా వెలిదండ్ల జట్టు నిలిచింది. అంతకముందు ఈ పోటీలను పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ సెక్రటరీ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు ప్రారంభించారు. ఈ పోటీలో 13 వాలీబాల్ జట్లు పాల్గొనగా.. అందులో వెలిదండ్ల, పులివెందుల సీఎస్ఐ సీనియర్స్ జట్లు ఫైనల్‌కు చేరాయి. వెలిదండ్ల జట్టు విజయం సాధించి మొదటి బహుమతి కింద రూ.3వేల నగదుతోపాటు మెడల్స్, మెమెంటోలను అందుకున్నారు. అలాగే పులివెందుల సీఎస్ఐ సీనియర్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచి రూ.2వేల నగదుతోపాటు మెడల్స్, మెమెంటోలను అందుకున్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, న్యాయ నిర్ణేతలు శ్రీకాంత్‌రెడ్డి, ఫ్రాన్సిస్, రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, విక్టర్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధి జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇళ్ల నిర్మాణ పనులపై మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డిలతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అనుకున్న ప్రకారం ఇళ్లనిర్మాణాలను త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో ఓ హౌసింగ్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని 1వ వార్డు ఇన్‌చార్జి ప్రశాంత్, 14 వార్డు ఇన్‌చార్జి షాహింద్‌లు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే హౌసింగ్ పీడీకి ఫోన్ చేసి దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా అథ్లెటిక్స్‌లో వైవీయూ క్రీడాకారుడి ప్రతిభ

వైవీయూ : అఖిల భారత విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడాకారుడు నక్కా రాజేష్ 7వ స్థానంలో నిలిచాడు. చెన్నైలో నిర్వహిస్తున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో 49.23 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి సత్తాచాటి టాప్–10లో నిలిచాడు. విశ్వవిద్యాలయ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి, శిక్షకుడు డా. కె. కృష్ణారెడ్డి తదితరులు రాజేష్‌ను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


పెరటి తోటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ రీసోర్స్ పర్సన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గురిజాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే 25 రకాల కూరగాయల పెరటి తోటను ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఎలాంటి రసాయన మందులు లేకుండా కాషాయాలు, ద్రావణాలతో కూరగాయలను పండించుకుని తినడంవల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ ఖాసీం, ఎంసీఆర్పీ భీమలింగయ్య, ఆదర్శ రైతు రవీంద్రనాథరెడ్డి, ఐసీఆర్పీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గంబూషియా చేపల విడుదల


చేపలను చెరువులో వదులుతున్న అధికారులు

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని చెరువు, పెద్దబావి నీటిలో ఉన్న దోమల లార్వాలను నివారించుటకు గంబూషియా చేపలను మంగళవారం నీటిలో వదలినట్లు జిల్లా మలేరియా అధికారి వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపలు దోమల లార్వాలను ఆహారంగా తీసుకుని దోమలు వృద్ధి కాకుండా చేస్తాయన్నారు. అనంతరం గ్రామంలో మేడిదిన్నె పీహెచ్‌సీ సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి సుబ్బరాజు, హెల్త్ సూపర్ వైజర్లు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ

కడప స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా టెన్నికాయిట్ బాలికల జట్టుకు హ్యాపీ కిడ్స్ కరస్పాండెంట్ పి. శివకుమారి క్రీడా దుస్తులను అందజేశారు. ఈనెల 11, 12 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆమె టీషర్ట్స్ పంపిణీ చేశారు. అమీల్, అంకన్న, శివశంకర్, రవిశంకర్, శేఖర్ తదితరుల పాల్గొన్నారు.

పేద ప్రజల ఆనందమే జగనన్న లక్ష్యం

• ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : పేద ప్రజల ఆనందమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాజీవ్‌నగర్‌లో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి సంక్షేమపథకాలు అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం అవ్వ, తాతలు గంటల కొద్ది క్యూలైన్లలో నిలిచేవారన్నారు. నేడు జగనన్న ప్రభుత్వంలో తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్ల తలుపులు తట్టి వలంటీర్లు పింఛన్లను అందిస్తున్నారన్నారు. గతంలో రాష్ట్రంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు వచ్చేవని నేడు 69 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ గృహనిర్మాణ శాఖధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, రమణయ్య యాదవ్, నాగేశ్వర్‌రెడ్డి, సంజీవరాయుడు, శివారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిషత్ సభా భవనంలో మంగళవారం ఆయన మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలపై స్పందించని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అత్యవసరమైన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధుల పురోగతిపై పంచాయతీరాజ్ ఏఈ మల్లారెడ్డిని ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆయనపై అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్, రైతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఉదయభారతి, విద్యుత్ ఏఈ రాజగోపాల్‌లను ఆదేశించడంతో వారం రోజుల్లో పూర్తి చేస్తామని వారు హామీ ఇచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య

పులివెందుల రూరల్ : ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా అధికారి గంగులయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చే విధంగా సుమారు ప్రజల కోసం 8 వేల ఇళ్లను జగనన్న కాలనీలో నిర్మించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులందరూ సహకరించాలన్నారు. రూ.35 వేలు చెల్లించి హౌసింగ్ కాలనీలో ఇళ్లు వేగవంతమయ్యే విధంగా చేపట్టాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఓ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీకి ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పులివెందుల టౌన్ : రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలకు పులివెందుల సీనియర్ ఉమెన్స్ క్రీడాకారులు ఎంపికైనట్లు పులివెందుల ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి శేఖర్, సీనియర్ హాకీ క్రీడాకారుడు అనీల్‌కుమార్, ఖేలో ఇండియా కోచ్ రవిలు తెలిపారు. ఈనెల 8వ తేదీన కడపలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో పులివెందులకు చెందిన క్రీడాకారులు లావణ్య, హరిత, పుష్పావతి, సోనాలి శ్రేయాభాయిలు ఎంపికయ్యారని.. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వీరి ఎంపికపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి


ఇస్లాంపురంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతాలలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన ఇస్లాంపురంలో పర్యటించి అక్కడ నెలకొన్న స్థల సమస్యను అధికారులతో కలిసి పరిష్కరించారు. అక్కడే కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఎన్‌జీఓలో చేరడం శుభసూచికం


సచివాలయ ఉద్యోగులకు మెంబర్‌షిప్ పత్రాలు అందిస్తున్న ఎన్‌జీఓ నాయకులు

కమలాపురం : సచివాలయ ఉద్యోగులు 60 సంవత్సరాల చరిత్ర ఉన్న ఎన్‌జీఓలో చేరడం శుభసూచికం అని కమలాపురం ఎన్‌జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగలక్ష్మీరెడ్డి, కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు. మంగళవారం వారు ఎన్‌జీఓలో చేరిన సచివాలయ ఉద్యోగులకు మెంబర్‌షిప్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాము స్పందించి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరలో ఇప్పిస్తామని, ఖాళీగా ఉన్న జాయింట్ సెక్రటరీ పోస్టులను సచివాలయ ఉద్యోగులతో భర్తీ చేస్తామని ఆయన అన్నారు.

వన్‌స్టాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. మంగళవారం నగరంలోని ఓం శాంతినగర్‌లో ఉన్న ఉజ్వల హోం, వన్‌స్టాప్ సెంటర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలోని గంగా ప్లాస్టిక్ సంస్థను ఆమె తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వైద్యసహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉన్నాయన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాల సమయంలో వన్‌స్టాప్ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. ఉజ్వల హోమ్, స్వధార్‌హోం నిర్వాహకురాలు మూలె సరస్వతి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, గంగప్లాస్టిక్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కడప అర్బన్: కడప నగర శివార్లలోని దిశ వన్‌స్టాప్ సెంటర్(సఖి)గురించి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది జె. మాధవీలత, ఎస్ఐ జ్యోతి అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని సీ.ఎం.ఆర్ పల్లెలో మెప్మా సమైక్య సమావేశంలో దిశ వన్‌స్టాప్ సెంటర్ (సఖి)పై అవగాహన కల్పించారు.